ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక (జూన్ 2000)

# విజేత

ఉమెన్ వెల్‌ఫేర్ సెంటర్‌లో చైతన్యం కలిగింది - అంటే ఉదయం తొమ్మిది గంటల యిందని ఊళ్ళో అందర్కీ తెలుసు. వేరే గడియారం చూడనక్కర్లేదు. ఎంబ్రాయిడరీ అల్లికలో ఒక అమ్మాయికి మెళకువలు చెపుతూ తన పనిలో నిమగ్నురాలై ఉంది శారద. అకస్మాత్తుగా ఆమె చుట్టూ నిశ్శబ్దమావరించుకుంది. ఆ అమ్మాయి తన చేతి మీద గీరినట్లయి ఆమె చకితురాలైంది.

గబుక్కున వెనక్కి తిరిగి చూసింది. తీక్షణమైన చూపులతో గంభీరంగా నిలబడి ఉన్నాడు ఓ అజానుబాహుడు. అతని వెనకాలే బాణాకర్ర నానుకొని కోరమీసం మీంచి మిర్రి చూస్తున్న మరో బలమైన విగ్రహం మరికొంత కథ చెప్పింది ఆమెకు.

చటుక్కున పైకిలేచి "ఎవరు కావాలండి?" అని అడిగింది శారద. వాళ్ళల్లో చాలమంది ఆగది దాటి వెనక చావిట్లోకి పోవటం ఆమె గుర్తించింది.

ఆవ్యక్తి సమాధానం ఇవ్వలేదు. తన కుడిభుజం వైపు ఓ చూపు విసిరాడు.

"మీతోనే పనుండి వచ్చారయ్యగోరు." అన్నాడతను.

తన కొలీగ్‌వైపు తిరిగి "వర్ధనమ్మగారూ! వీరిని కాసేపు ఆఫీసుగదిలో కూర్చోమని చెప్పండి" అని చెప్పి జవాబుకయినా ఎదురుచూడకుండా వెనుక చావిడివైపు నడిచింది శారద.

అక్కడ గుమిగూడిన స్త్రీలంతా ఏదో గుసగుసలాడుకుంటున్నారు. శారదను చూసి అంతా ఆమెను చుట్టుముట్టారు.

"ఏం - అంతా అలా పారిపోయివచ్చారు?"

అంతా ఒకరి ముఖాలింకొకరు చూసుకున్నారు. శారద రెట్టించేసరికి ఒకామె ధైర్యం చేసి చెప్పింది,

"ఆయన మనూరి సర్పంచిగారు"

"అయితే?"

శారద ప్రశ్నకి అక్కడి స్త్రీలంతా నిర్ఘాంతపోయారు. కాని, ఏం చెప్పాలో ఎలా చెప్పాలో ఎవరికీ అర్థం కాలేదు.

"ఒక మామూలు మనిషిని చూసి అలా దడుచుకునే మీరు జీవితంలో ఎలా పైకొస్తారు?"

ఒకామె గొంతు పెగల్చుకుంది. "ఆయనెంత ప్రమాదమైన మనిషో మీకు తెలియదు"

"అటువంటి మనిషికి ఓటెయ్యమని ఎవరు చెప్పారు?"

ఎవర్కీ నోరు పెగల్లేదు. సర్పంచి గురించి ఆమెకావూరు వచ్చినవాడే వర్ధనమ్మ పూర్తి వివరాలు చెప్పింది.

"పులితోలు కప్పుకున్న మేకల్ని చూసి భయపడకండి. వచ్చి మీ పని చూసుకోండి. ఇక్క డికి మీరెన్నో నేర్చుకోవటానికి వచ్చారు. ఎవరికయినా ఎందుకు భయపడాలి?"

శారద కంఠంలో - ప్రతి పలుకులో - ప్రతి చూపులో ఏదో శక్తి! అంతరాలలోంచి అవుననిపించే ఆకర్షణ!

ఒక అరగంట వరకు శారద తన పని హడావిడిలో ఉండిపోయింది.

"ఆయన మండిపోతున్నారమ్మా!" అని వర్ధనమ్మ వచ్చి చెప్పే వరకు శారదకు మరే విషయమూ గుర్తులేదు.

వర్ధనమ్మ వెనకాల రాగా ఆఫీసు గది వైపు నడిచింది శారద. గుమ్మం దగ్గరే గోడకానుకొని ముఖం కందగడ్డ చేసుకొని నిలబడి ఉన్నాడు సర్పంచి. "కూర్చోండి. ఇప్పుడు చెప్పండి. మీకేం కావాలి?" అంది ఆమె తొణక్కుండా.

దానితో మరింత రెచ్చిపోయాడు రంగారావు. "వర్ధనమ్మా! పంతులమ్మకి తామర చెఱువు నీళ్ళు వంటబట్టినట్టున్నాయే?" అన్నాడు పెళుసుగా.

శారద ముఖం ఎర్రనైంది. "మీ వేళాకోళాలు వినటానికి నాకు తీరికలేదు. మీరు వచ్చిన పనేమిటో చెప్పండి"

గబుక్కున వర్ధనమ్మ అందుకుంది. "క్షమించండమ్మా! నేనే పరిచయం చేయటం మర్చిపోయాను. వీరు మన సర్పించి రంగారావుగారు."

"ఓహో! అందుకనే కాబోలు అంతమంది ఆడవాళ్ళు అక్కడ పని చేసుకుంటుండగా లోపలికి వచ్చేసారు!"

"ఏమిటి నువ్వనేది?" రంగారావు అరిచాడు.

"మీరలా నా అనుమతి లేకుండా లోపలికి రావటం అనుచితం అంటాను."

ఆమె మాటలకి రంగారావు మండిపడిపోయాడు.

"నువ్వెవరు నన్నడగటానికి?"

"నేనెవర్నో నాకు బాగా తెలుసు. స్త్రీ సంక్షేమ కేంద్రంలో పురుషులకేం పని ఉంటుందో మాత్రం నాకు తెలీదు. అయినా, ప్రొద్దున్నే మీతో తగువులాట పెట్టుకోటానిక్కాదు నాకు ప్రభుత్వం జీతం ఇచ్చేది. ఇక్కడికి వచ్చినివాళ్ళకు కొద్దో గొప్పో నాకు తెలిసింది నేర్పటానికి... వర్ధనమ్మగారూ! అతిథిగా వచ్చినవారికి అమర్యాద చేయటం మన లక్ష్యం కాదు. వీరికి కాఫీ తెప్పించండి" అని రంగారావు వైపు తిరిగి "క్షమించండి. నాకు ఇప్పుడు తీరుబడి లేదు. పని ఏదయినా ఉంటే సాయంత్రం నాలుగు గంటల తర్వాత రండి.... అంతగా మీరురాలేకపోతే కబురంపండి. నేనే వస్తాను. నాకటువంటి అభ్యంతరాలు, పట్టింపులు లేవు. మీరు గ్రామాధికారులు. మీ మాటకి విలువ ఇవ్వటం ఈవూరి మనిషిగా నా ధర్మం. శలవు" అని ఓసారి నమస్కరించి వెనుదిరగకుండా చకచక అడుగులు వేస్తూ కేంద్రంలోకి వెళ్ళిపోయింది శారద!

అంతటి అజానుబాహు విగ్రహమూ నోటమాటరాక నీళ్ళు కారిపోయింది! కుడిభుజం గంగడి నోరు తెరిచి నది తెరచినట్లే ఉండిపోయింది.

● ● ●

అటు పల్లె – ఇటు పట్టణము కాని ఆ గ్రామంలో ఈ కేంద్రం స్థాపించబడి నాల్గేళ్ళవుతున్నా శారద వచ్చేవరకూ చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏమీ జరగలేదు. నిర్వహణ ఇద్దరి చేతులు మారిందే కాని – స్త్రీ జనోద్ధరణ మాట దేవుడెరుగు – ఆ కేంద్రానికి చెడ్డపేరు తీసుకు వచ్చి మరీ వెళ్ళారు.

రంగారావు చేతుల్లో కీలుబొమ్మలు – సంసార స్త్రీలు అడుగు పెట్టడానికి సరైన కేంద్రం కాదన్న చెడ్డపేరు తెచ్చి మరీపోయారు నిర్వహించినవాళ్ళు!

ఎటొచ్చీ మొదటి నుంచి ఓ సహాయకురాలిగా ఉన్న వర్ధనమ్మ మాత్రం తన విధిని తాను నిర్వర్తించుకొని అటు నిర్వాహకురాలి ఒద్దికలోను – ఇటుగ్రామస్తుల నోళ్ళలోను మంచిగానే మసులుకుంది.

నిర్వాహకురాలిగా క్రొత్తగా వచ్చిన శారద వర్ధనమ్మ నిట్టే ఆకర్షించింది. పాతికేళ్ళ పసిడి యవ్వనంలో మనో నైర్మల్యాన్ని ముఖంలో ప్రస్ఫుటం చేసుకొని వర్ధనమ్మ నేమిటి – కనిపించిన

ప్రతి వ్యక్తిని ఆకర్షించింది శారద!

ముఖంలో మాయని మందహాసము, చూపుల చురుకుతనము, మాట మంచితనము – ఆమెకు పెట్టని సొమ్ములు. విజ్ఞానానికి తోడు వివేకం, తను చేపట్టిన పని మీద అమితమైన శ్రద్ధ వర్ధనమ్మను అప్రతిభురాల్ని చేశాయి.

"వీళ్ళు అడివి మనుషులు. వీళ్ళను బాగు చేయటం ఎవరితరం? మన ఉద్యోగాలన్నీ మనలాంటి వాళ్ళు పొట్టపోసుకోవటానికి కాకపోతే దేనికని?" అంటూ అసహ్యంగా మాట్లాడిన అలనాటి కామేశ్వరమ్మకు –

"వీళ్ళు అమాయక ప్రజలు. వీళ్ళని అభివృద్ధికి తీసుకురావాలంటే మనం మన దేశాన్ని పురోభివృద్ధిలోకి తీసుకురావటమన్నమాట! ఇంటి యజమాని విజ్ఞానం చేయలేని పనిని ఇంటి ఇల్లాలి వివేకం అద్భుతంగా పనిచేస్తుంది. ఒక పురుషుని చదివిస్తే – అది అతనికే లాభం కాని, ఒక స్త్రీని చదివిస్తే అయింటినంతటినీ చదివించినట్టే!' అంటూ త్రికరణశుద్ధిగా మాట్లాడిన ఈనాటి శారదకు – హస్తిమశకాంతర ముందనుకుంది వర్ధనమ్మ.

కొద్దో గొప్పో తెల్సినవాళ్ళను కూడా "మీది ఉత్తుమట్టి బుర్రలు – ఎన్నిసార్లు చెప్పినా అర్థం కాదు. ఇంతకన్న జంతువులు నయం. మీ కోసం నా గొంతు పాడుచేసుకోవటం దండగ" అంటూ కసురుకున్న అలనాటి కామేశ్వరమ్మకు –

చేతి పనుల్లో ఓనమాలనాడే 'మీ చేతిలో మంచి పనితనం ఉంది. కోరిక ఉండాలే కాని" నేర్చుకోవటానికి పట్టుమని పదిరోజులుపట్టవు" అని కొందరిని అమితంగా ప్రోత్సహించిన ఈనాటి శారదకు మధ్య ఉన్న తేడాని అగ్రామీణులు గుర్తించటానికి అట్టే కాలం పట్టలేదు.

ప్రతి యింటిలోను శారద గుణగణాలు గురించి, శారద నేర్పుతున్న క్రొత్త చేతి పనుల గురించి చెప్పుకోవటం మొదలుపెట్టారు.

గ్రామాల్లో ఏ వార్త అయినా పాకి పారాడటానికి క్షణాలు పట్టవు. అందులో పెళ్ళికాని పాతికేళ్ళ పడుచు ఇంతమందికి మార్గదర్శిని కావటం అ గ్రామంలో మొట్టమొదటి వింత!

• • •

శారద సర్పంచిగారింట్లో అడుగుపెట్టేసరికి ఎవరూ ఎదురురాలేదు. ఆయన లేనట్టున్నాడు. ఆ పెద్ద మేడ బావురుమంటూంది. ఎక్కడా శుచీ శుభ్రం లేదు.

'డాబు... దర్పం ఉండగానే సరా. ఏం చూసి ఈయన్ని సర్పంచిగా ఎన్నుకున్నారో...' అని ఆమె అనుకున్న క్షనంలోనే 'డబ్బు డబ్బు' అంటున్నట్టు ఘల్లుఘల్లుమనే ఆభరణాలు ఒంటినిండా దిగేసుకొని ఆ ఇంటి యిల్లాలు ముందు వాకిట్లోకి వచ్చింది.

ఆవిడ ముఖం చిట్లించుకోవడం గుర్తుపట్టనట్లే తను చిరునవ్వు చిందిస్తూ "నమస్కారం! సర్పంచగారున్నారాండీ!" అంది శారద.

"లేరు. నువ్వెవరు? ఆయనతో నీకేంటి పని?" ప్రత్యభివాదం చేయలేదు సరికదా, కూర్చోమని చెప్పలేదు సరికదా.. ఏకవచన ప్రయోగంతో అసహ్యంగా ఆమె మాట్లాడుతుంటే

శారదకు వెగటనిపించింది. ఇంటాయనకు ఇంటావిడకు అట్టే తేడా లేదనిపించింది.

"ఈ వూళ్ళో ప్రతి యింటితోటి నాకు పని వుందండీ!" అంది ఓర్పుగా.

"అంటే?"

"సెంటర్ పేరు విన్నారనుకుంటాను."

"ఆ! వినకేం? బ్రహ్మాండంగా విన్నాను. ఆరు నూరయినా నేనక్కడికి వచ్చేది లేదు"

శారదకామెను చూసేసరికి నవ్వొచ్చింది. బలవంతాన ఆపుకుంది. "ఆరు నూరవదు. మీరక్కిడికి రానూరారు. రారని నాకూతెల్సు"

అప్పుడే అక్కడికో నాలుగేళ్ళ పిల్ల ఊలు స్వెట్టరు తొడుక్కొని వచ్చింది. ఆ స్వెట్టరు చూడగానే శారద ముఖం వికసించింది. వెంటనే ప్రస్తావన మార్చేస్తూ "ఆ స్వెట్టరు బావుంది కదూ! మీ అమ్మాయి ముద్దొస్తోంది."

"మీ సెంటరులోదే. మా పిన్నిగారమ్మాయి చూపిద్దామని తెచ్చింది."

"అదెవరు అల్లారో తెలుసా?"

"తెలియదు."

అప్పుడే 'అక్కోయ్' అంటూ పదహారేళ్ళ పిల్ల పరుగున అక్కడికి వచ్చి శారదను చూసి క్షణంపాటు తెల్లబోయింది. "మాస్టారమ్మగారా!" అంది.

శారద మందహాసం చేసి "ఎందుకలా కంగారుపడతావ్ లక్ష్మి" అంది.

"మరే... మరే.. మా అక్కయ్యగారి అమ్మాయికి ఎలా వుంటుందోనని స్వెట్టరు తొడిగానండీ! సరిపోతే... ఇలాంటిదే అల్లియిద్దామని." అని ఆ పిల్ల నసిగింది.

"దాంట్లో తప్పేముంది? నేర్చుకుంటావనే కదా నీకిచ్చాను!"

సర్పంచిగారి శ్రీమతి పావుగంటలోరెండు లంఖణాలు చేసినదానిలా డీలాపడిపోయింది. ఇన్నేళ్ళు వచ్చి తను చేయలేని పనులు తనకంటె చిన్నపిల్ల చేసి చూపెడుతోంది. ఎవరినుండి ఈ పనితనం నేర్చుకుందో ఆ వ్యక్తి తన యెదుట నిలబడి వుంది.

"మిమ్మల్ని తప్పుపట్టాలని నేనామాటలనలేదు. మీ అపోహలు పోగొట్టాలనే అన్నాను. సెంటరు గురించి మీకెవరో చెడుగా చెప్పారు. మీరామాటలు నమ్మారు. మీరొకసారి స్వయంగా వచ్చి చూడకూడదా! మన గ్రామాన్ని పైకి తీసుకువచ్చే ప్రయత్నంలో మీకు బాధ్యతలేదా? మీరు గ్రామాధికారి భార్యగా మాత్రమే ఉండిపోకూడదు. ఈ వూరి స్త్రీజనానికి దారి చూపేవారు కావాలి."

ఆమె మాటలు పూర్తి కాలేదు. "ఇంతకీ మొగుడ్ని వొదిలేసి నీలా తైతక్కలాడమంటావు. అంతేనా!" రంగారావు గొంతు ఆ గది గుమ్మంలో ఖంగున మ్రోగింది.

క్షణం పాటు అసహ్యంగా చూసింది శారద. "పెళ్ళాన్ని వదిలేసే వాళ్ళకే మొగుళ్ళని పెళ్ళాలు ఎందుకు వదిలేస్తారో బాగా తెలుస్తుంది. ఆ విషయం ఆలోచించటానికి నాకింకా పెళ్ళే కాలేదు."

"ఏం పాపం, ఎవడూ దొరకలేదా?"

శారద ముఖం జేవురించింది. "అవును. నాకు సరయినవాడు దొరకలేదు. దొరికిన రోజున మిమ్మల్ని పెళ్ళికి పిలుస్తానులెండి"

ఆమె ముఖం మీద సవాలులాంటి చిరునవ్వు రంగారావును మంటబెట్టింది. ఎదురుగా తన భార్యే అక్కడ లేకపోతే ఏం చేసేవాడో అతనికే తెలియదు.

ఇంతలో లక్ష్మి పొగలుకక్కే కాఫీ కప్పుతో అక్కడికి వచ్చింది. ఆ కప్పు అందుకుంటూ, "మీ అక్కగారికి, బావగారికీ తీసుకురాలక్ష్మీ" అంది శారద.

లక్ష్మి మరోరెండు కప్పులతో వచ్చేవరకు శారద కాఫీ త్రాగలేదు. ఇదంతా సర్పంచిగారి భార్య గమనిస్తూనే ఉంది. శారద ఒక అపూర్వ స్త్రీ అనిపించిందామెకు.

కాఫీలయ్యాక "మీతోనే పనుండి వచ్చాను" అంది శారద.

నిర్లక్ష్యంగాచూస్తూ "నువ్వు గొప్పదానివి. మాతో నీకేం పని?" అన్నాడు రంగారావు.

ఆ మాటలకలవాటు పడినట్లు తలపంకించి నవ్వింది శారద. "నాకోసం నేను రాలేదు. సెంటర్ అభివృద్ధి విషయంలో మీసాయం కోసం వచ్చాను. సెంటర్లోని నాలుగు గదులు ఇప్పుడు వస్తున్నవాళ్ళకి చాలటం లేదు. త్వరలో మరికొందరు చేరబోతున్నారు. మీరు బి.డి.వో. గారితో చెప్పి ఫండ్సుకు ఏర్పాటుచేస్తే మంచిది. మీకు పేరు కూడా వస్తుంది."

"అదేదో నువ్వే బాపుకోరాదూ!" కసిగా అన్నాడు రంగారావు.

శారద మళ్ళీ నవ్వింది. "ఇంట్లో ఎవరు మంచి చేసినా ఇంటాయనకే పేరు వస్తుంది. అలాగే వూరు విషయమూను. వర్ధనమ్మగారూ, నేనూ సెంటర్ ఖాళీ చేస్తున్నాము. ఎక్కడయినా అద్దెకు ఉంటాము. ప్రస్తుతానికా రెండు గదులు మరికొందరికి చోటిస్తాయి. ఇక మీదట ఓ పెద్ద యిల్లు ఏర్పాటు చేస్తే కాని సెంటరు అభివృద్ధిలోకి రాదు. మీరు గ్రామాధికారులు కనుక మీకు చెప్పాల్సింది చెప్పాను. ఆ పై తమ ఇష్టం. శలవు... వస్తానండీ!" అని సర్పంచిగారి భార్యకు నమస్కరించి వాళ్ళమ్మాయి బుగ్గ పుణికి ముద్దుపెట్టుకొని... తన హేండ్‌బేగ్‌లోంచి తీసి తాను కుట్టిన పువ్వుల చిలుకను ఆ పిల్లచేతిలో పెట్టి, ఆ దంపతుల గొంతు పెగలకముందే అక్కడ్నించి నిష్క్రమించింది శారద.

• • •

అహంకారం ఒక్కొక్కప్పుడు ఎంతటి హానికయినా తలపడేలా చేస్తుంది. తననే విషయంలోను లెక్కచేయకుండ అందరి మన్ననలు పొందుతున్న శారద రంగారావుకు కొరకరాని కొయ్య అయిపోయింది. ఆమెనెలాగయినా లొంగదీసుకోవాలని అతనిలో పట్టుదల కలిగింది.

ఆమెపై నానాహీనంగా చాడీలు చెప్పి ఆమె ఉద్యోగానికే ఎసరు పెట్టాలని బి.డి.వోని ఒకసారి వచ్చి చూడమన్నాడు రంగారావు.

వారం వారం సెంటర్ ప్రోగ్రెస్ మీద శారద రిపోర్టు పంపుతోందని అతనికి తెలియదు.

ఇదివరకు మరో గ్రామంలో ఆరు నెలల్లో మంచి అభివృద్ధిసాధించి వచ్చిన వ్యక్తిగా బి.డి.వోకి బాగా తెలుసుని రంగారావుకి తెలియదు.

బి.డి.వోని వెంటపెట్టుకుని అతడు వచ్చేసరికి శారద ఒక అద్భుతం చేసి చూపెట్టింది. సెంటర్ పూర్తిగా అలంకరింపబడి వుంది. పాతికమంది ఆడపిల్లలు 'బాడ్జెస్' తగిలించుకుని వాలంటీర్లుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చిన నెలరోజుల్లోగా శారద చూపించిన అభివృద్ధికి తార్కాణంగా కుట్లు, అల్లికలు, బొమ్మలు మొదలైనవి నాలుగు వందల దాకా అక్కడ తరగతివారీగా పేరు పేరునా ప్రకటించి ప్రదర్శించారు. అక్కడున్న ప్రతి వస్తువులోను ప్రతి అలంకరణలోను నిర్వాహకురాలి కళాహృదయం, అవిరళదీక్ష, హృదయ నైర్మల్యం, మంచి నేర్పు ప్రస్ఫుటమవుతున్నాయి.

సభ ఏర్పాటయింది. నాలుగు వందల మంది దాకా హాజరయ్యారు. వేదిక మీదకి బి.డి.వోగార్ని, సర్పంచిగార్ని ఆహ్వానించింది శారద. ముఖం కందగడ్డ చేసుకొని వేదికనెక్కాడు రంగారావు. చెప్పదల్చుకున్న నాలుగు ముక్కలూ టూకీగా చెప్పింది శారద.

"... ఈకేంద్రం యొక్క అభివృద్ధి ఈ గ్రామంలో ప్రతి ఒక్కరి మీద ఆధారపడి ఉంది. మీరు సహకరిస్తే ప్రభుత్వం సహాయం చేస్తుంది. మన సెంటర్‌కి తగిన జాగా లేక అనేకమంది స్త్రీలు చేరలేకపోతున్నారు. అందుకని ప్రత్యేకంగా ఒక పెద్ద బిల్డింగు అవసరమని సర్పంచిగారు బి.డి.వో గారితో చెప్పి తీసుకువచ్చారు. ఇన్నాళ్ళకు మన ఆశ ఫలించింది."

బి.డి.వో గారు సర్పంచి గారు ఒక ముఖాలింకొకరు చూసుకోవటం శారద క్రీగంట గమనించకపోలేదు. బి.డి.వోగారు చిన్నగా నవ్వుకున్నారు. రంగారావు ముఖంలో కత్తి వాటుకు నెత్తురు చుక్కలేదు.

"ఏమయినా పూర్తిబాధ్యత ప్రభుత్వంపై పెట్టివేయటం మనధర్మం కాదు. మనం కూడ మన శక్తి కొద్దీ ఈ సంస్థ కోసం చందాలివ్వాలి. ఎవరికి తోచింది వారు ఇచ్చి ఈ మహత్కార్యాన్ని జయప్రదం చేయండి. నాశక్తికొద్దీ ఒకనెల జీతాన్ని నేను చందాగా సమర్పిస్తున్నాను. ఈ సభకి విచ్చేసిని అధికారులకు, అక్కచెల్లెళ్ళకు, అన్నదమ్ములకీ నా వందనాలు."

ఆ తర్వాత, రంగారావు పరాజయాగ్నిలో అజ్యధారలై కురిసాయి చందాలు.

● ● ●

రాత్రి పదిగంటలు దాటింది. పగలు పడిన శ్రమకు కళ్ళు మూతలు పడుతున్నా మర్నాడు తాను సెంటర్‌లో చేయవలసిన పనికి నోట్సు వ్రాసుకుంటోంది శారద. తలుపు తట్టిన చప్పుడయ్యేసరికి ఉలిక్కిపడింది. ఒక్క క్షణం గుండెలు దడదడలాడాయి.

వెంటనే నిలద్రొక్కుకుని నెమ్మదిగా తలుపులు తీసింది. ఊహించిన వ్యక్తే ఎదురుగా ఉండేసరికి ఆమె తొణకలేదు.

రంగారావు కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయి. తాగి వచ్చాడని శారదకర్థమయింది.

"ఓహో! సర్పంచిగారా! రండి రండి. మీరు వస్తారని అనుకుంటూనే ఉన్నాను."

తానాశించినట్లు భయపడలేదు సరికదా నవ్వుతూ ఆమె ఇలా చెప్పేసరికి తెల్లబోయాడతను. తనకంటె బలమైనవాడు ముఖాన మొత్తినా అతడంత ఖంగుతిని వుండేవాడు కాదతను. తాగిన మత్తు సగం దిగిపోయినట్టయింది.

"అలా నిలబడిపోయారేం? కూర్చోండి... ఇంత అర్ధరాత్రి వస్తారని తెలిసినా కూడా మీకోసం ఏమీ చేయలేకపోయాను. కాఫీ మాత్రం ఫ్లాస్కులో ఉంది" అంటూ గ్లాసులో పోసి ఇచ్చింది శారద.

"వద్దు."

"ఏం?"

"దీనికోసం రాలేదు నేను."

"దేనికోసం వచ్చారో నాకు తెలుసు. ముందిది త్రాగండి."

ఇంకేమనగలడు? గబగబ కాఫీ త్రాగేసాడతను.

""ఇప్పుడు చెప్పు. ఏమంటావో?"

"ఒక్కక్షణం ఉండండి." అంటూ ప్రక్కగదిలోకి వెళ్ళి రెండు నిముషాల్లో పసుపు పూసిన తాడుకు పసుపుకొమ్ము కట్టి తెచ్చింది శారద. "ఇదేమిటో తెలుసా?"అని అడిగింది.

"తెలుసు. పసుపుకొమ్ము."

"ఇది ప్రతి ఆడదానికి కావల్సింది"

"ఇంతకీ ఏమంటావ్?"

"నేను పెళ్ళికానిదాన్ని. ఇది కట్టించుకున్న తృప్తయినా దక్కాలని."

"నాకేం అభ్యంతరం లేదు."

"మీకు లేకపోతే మీ భార్యకుంటుంది కదా!"

"అదెవరు నన్ను అడ్డుపెట్టటానికి? పుట్టింటికి పొమ్మంటాను."

శారద ఫక్కున నవ్వింది. "కోర్టుకీడుస్తుంది మీ భార్య. ఒక భార్య ఉండగా మరో స్త్రీతో పెళ్లికి చట్టం ఒప్పుకోదు."

"దాని ముఖం. దానికా దమ్ములు లేవు."

"అవసరమొస్తే తాడే త్రాచవుతుంది."

"అంతగా వస్తే విడాకులిస్తాను"

"అయితే, ఓ నిశ్చయానికి వచ్చి మరీ వచ్చారన్నమాట."

"ఆ! నువ్వు తెలివైనదానివి. నువ్వు నాకు నచ్చావు. ఎలాగయినా నిన్ను నాదాన్ని చేసుకోవాలనుకని వచ్చాను. పెళ్ళికి సిద్ధమవుతున్నావు. మరీ మంచిది."

"సరే. కొంచెం వీధి తలుపు లోపల గొళ్ళెం పెట్టిరండి. నేనీలోపల మంచి చీర మార్చుకు వస్తాను."

హుషారుగా లేచి ఆమె చెప్పిన పని చేసాడు రంగారావు. ప్రక్క గది తలుపులు దగ్గరగా

వేసివున్నాయి. ఆమె చీర కట్టుకుంటోంది కాబోలు! అతనికెంతో కులుకుగా ఉంది. ఎంతో బెట్టుచేసి నానా రభస చేస్తుందనుకున్న పిల్ల ఇంత సుళువుగా లొంగిపోయిందేమిటి? అతని కెంతో ఆశ్చర్యంగా ఉంది! 'పసుపుతాడు కట్టించుకొని మరీ దరికి చేరుతుందిట! ఎంత ఘటికురాలు' పెళ్ళాడితే ఇలాంటి మానవతినే ఆడాలి... ఏమయినా, ఇప్పటికి తనది పై చేయి. రేపటి మాటరేపు చూసుకోవచ్చు - తనకు లొంగిపోయింది. అంతే చాలు.

అతని ఊహాగానం పూర్తికాలేదు. బయట కిటికీవద్ద శారద గొంతు వినిపించి ఉలిక్కిపడ్డాడు రంగారావు.

ఆమె చీర మార్చుకోలేదు. ముఖం జేపురించి ఉంది.

"ఏం చేస్తున్నావక్కడ?" కంగారుగా అడిగాడు రంగారావు.

"ఒక్కక్షణం ఆగండి. మీ భార్య ధనలక్ష్మిగారు అరగంట నుంచి పాపం చీకటిలో ఆ కిటికీ ప్రక్కన.."

"అది వచ్చిందా! నువ్వే... నువ్వే పిలిపించి వుంటావు. రాక్షసి! నిన్నేం చేస్తానో చూడు" తలుపు తీయటానికి ప్రయత్నించాడు అతను. కాని, అది తెరుచుకోలేదు.

అప్పుడతనికి శారద ఏం చేసిందో అర్థమయింది. చీర కట్టుకుంటానని ప్రక్క గదిలోకి వెళ్ళి అక్కడ గడియపెట్టి రెండో గుమ్మం గుండా మెల్లగా బయటకు వచ్చి వీధి తలుపుకు బయట గొళ్ళెం పెట్టింది ఆమె. కళ్ళల్లో కారం కొట్టిపారిపోవటమంటే ఇదేనేమో!

బోనులో సింహంలా కలయదిరిగాడతను. కిటికీ వద్ద తలదించుకొని నోటమాట రాక నిలబడి వున్న భార్యని చూసేసరికి అతను మరీ రెచ్చిపోయాడు.

"అయ్యా! మీరు వూళ్ళో వాళ్ళందర్నీ పిలవాలంటే అంతకష్టపడి గొంతు చించుకోనక్కర్లేదు. కావాలంటే ఇద్దరు ముగ్గుర్ని నేను పిల్చుకువస్తాను. తక్కింది వాళ్ళు పూర్తిచేస్తారు."

రంగారావు కొయ్యబారిపోయాడు.

"వద్దమ్మా! అంత పని చేయకు" అంది ధనలక్ష్మి కంగారుగా.

"నువ్వు నోరుముయ్యవే దరిద్రమొగమా! నీ మూలానే ఇదంతా." అంటూ భార్య మీద కసురుకున్నాడతను.

"అర్థమయిందామ్మా మీ భర్త ఎలాంటివారో? ఒక ఆడది పైకి రావటం ఇష్టంలేక అసూయతో అహంకారంతో ఎంతవరకు తీసుకువచ్చారో చూడండి. ఈయనలో ఏం గొప్పతనముందని అంతా భయపడాలి? గౌరవంగానేను పిలిస్తే 'నువ్వు నువ్వ'ని గేలిచేసి నందుకా? అంతమంది ఆడవాళ్ళు పని చేసుకుంటుండంగా సెంటర్ లోపలికి చొరబడిన దుహంకారానికా? ఉన్న మాటంటే ఉలుక్కుని తామర చెరువు నీళ్ళు వంట పట్టించుకుంటు న్నానంటూ ఎకసెక్కాలాడినందుకా - ఇంటికి వచ్చి పెద్దరికం కట్టబెట్టి సాటి ఆడవాళ్ళల్లో మిమ్మల్ని పెద్దదాన్ని చేయాలని అంటే తైతక్కలాడుతున్నానని అవమానించిందుకా - ఏం చూసుకొని ఈయనకీ అహంకారం? డబ్బుందనేగా? ఈ క్షణంలో ఆ డబ్బు పరువుని

కాపాడుతుందా? ఎప్పుడు మమ్మల్నా పాతయింటి నుంచి ఇక్కడికి మార్చేలా ఏర్పాటు జరిగిందో అప్పుడే ఈయన నా పై పగబట్టారని నేను గ్రహించాను. ఈ వేళ వర్ధనమ్మగారు ఊరికి వెళ్ళింది కనుక తను అవకాశం చూసుకుంటారనీ ఎరుగుదును. అందుకనే లక్ష్మి ద్వారా ముందు మీకు కబురుపంపాను. కళ్ళారా చూసారుగా!" అంది శారద.

నోట మాట రాక నీళ్ళు కారిపోతున్నాడు రంగారావు. ధనలక్ష్మి క్రుంగిపోయింది.

"సెంటర్ పెట్టించారని అందర్నీ ఆయన చెప్పుచేతల్లో ఉంచాలనుకున్నారు. కాని, ఇది ప్రజాధనంతో ప్రజల కోసం కట్టించినది. ఆ ప్రజల కోసమే ఈయనకి పెద్దరికం ఇచ్చింది. ఈయన్ని ప్రజలు ఎన్నుకున్నారంటే ఈయన గొప్పతనం చూసికాదు. బాగా డబ్బు ఉన్న శ్రీమంతులని భయపడి! ఎల్లకాలం అపకీర్తిని కట్టుకుంటే ఈ డబ్బు ఉద్ధరిస్తుందా? చదువులేదు. కనీసం సంస్కారమయినా లేదు. పోనీ, మంచి మనసయినా ఉందనుకుంటే, అదీ లేదు! ఇంక ఏంచూసి ఈయన చేత పుస్తె కట్టించుకోవాలి నేను?"

"ఇంకా ఎందుకమ్మా! చచ్చిన పామునే చంపుతావు" ధనలక్ష్మి గొంతు బొంగురుపోయింది.

శారద మనస్సు ద్రవించింది. "నేనంత చెడ్డదాన్ని కాదమ్మా! మీ భర్తని నిందిస్తున్నానంటే మిమ్మల్ని చిన్న చూపు చూడటమని నాకూ తెలుసు. నాకు జరిగిన ఈ అవమానానికి నా మనస్సు ఎంత నలిగిపోతున్నా సాటి స్త్రీకి నా వల్ల అవమానం జరగకూడదనే నిగ్రహించు కుంటున్నాను. మీ భర్త చేసిన అపకారానికి ప్రతీకారం చేయాలంటే నాకు పదినిముషాలు పట్టదు. కాని, అది నా ఉద్దేశం కాదు.

ఒక ఆడది పైకి వస్తుంటే అసూయపడే ఈయన్ని చూసి నేను జాలిపడ్డానే తప్ప ఎప్పుడూ కోపగించుకోలేదు.

ఈ వేళ నన్ను సర్వనాశనం చేయాలని ఆయన పథకం వేసుకువచ్చినప్పుడు కూడ నేనాయన్ని ఏమీ అనలేదు. తన తప్పు తెల్సుకుంటారేమోనని అనేక విధాల ప్రయత్నించాను. మీరు వినాలనే అన్ని మాటలు మాట్లాడాను. నా అవసరం తీరిపోతే నేనీ వూళ్ళో ఒక్కక్షణం ఉండను. నేను సాటి స్త్రీలకు మంచి అలవాట్లు నేర్పుదామని ఈ వూరు వచ్చానే కాని ఏ భార్యాభర్తల్నీ విడదీద్దామని రాలేదు– ఏ సంసారంలోను కలతలు తేవాలని రాలేదు. మీ భర్తని మీకే అప్పగిస్తున్నాను."

శారద తలుపు గొళ్ళెం తీసింది. కోరలు తీసిన పాములా ముడుచుకుపోయిన రంగారావు తలెత్తి శారద వైపు చూడలేకపోయాడు.

"మొదటిసారిగా మీరు నాయింటికి వచ్చారు." అంటూ కుంకుమబొట్టు పెట్టి ధనలక్ష్మి చేతుల్లో జాకెట్టు ముక్క, అరటిపళ్ళు పెట్టింది శారద.

వాళ్ళు చీకట్లో కలిసిపోయేవరకు దీపపు కాంతిలో అక్కడే నిలబడింది ఆమె!

•